ఈనాడు
కుమురం భీం
శుక్రవారం అక్టోబరు 11, 2024



ఆసిఫాబాద్ శివ కేశవ ఆలయం వద్ద బతుకమ్మతో యువతి



ఆసిఫాబాద్‌లోని వాసవీ మందిరంలో బతుకమ్మలతో మహిళలు

సద్దుల సంబరం



రెబ్బెనలో..





గోలేటిలో బతుకమ్మను తీసుకెళ్తున్న అక్కాచెల్లెళ్లు

జిల్లాలో గురువారం సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. చిన్నారులు, యువతులు, మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పోటీపడి పేర్చారు. నూతన వస్త్రాలు, ఆభరణాలను అలంకరించుకొని కూడళ్లు, ఆలయాలు, దేవీ మండపాల వద్దకు చేరి ఆడిపాడారు. పలుచోట్ల ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు అందజేశారు. అర్ధరాత్రి వరకు సంబరాలు చేసుకొని సమీప వాగులు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. ప్రసాదాలు, వాయినాలు ఇచ్చిపుచ్చుకొన్నారు.

-న్యూస్‌టుడే, ఆసిఫాబాద్ అర్బన్

జిల్లాను విద్యారంగంలో ముందుంచండి


● కొత్త ఉపాధ్యాయులకు కలెక్టర్ ఉద్బోధ



విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు మిఠాయిలు తినిపిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, చిత్రంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : డీఎస్సీ ద్వారా ఎంపికైన యువ ఉపాధ్యాయులు విద్యార్థులను తమలా విజేతలుగా తీర్చిదిద్ది ఉద్యోగానికి వన్నె తేవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే సూచించారు. సమాజాన్ని తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకున్నందుకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేస్తూ వారి బంగారు భవిష్యత్తు బాటలు వేయాల్సిన గురుతర బాధ్యత మీపై ఉందని స్పష్టం చేశారు. గురువారం డీఈవో కార్యాలయానికి వచ్చి విధుల్లో చేరిన ఉపాధ్యాయులు పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.పర్వతి సత్యనారాయణ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ వారికి మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు. మీ జిల్లాను విద్యారంగంలో ముందుంచడానికి అద్భుతమైన అవకాశం వచ్చిందని, అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సమాజంలో గౌరవాన్ని అందుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కటుకం మధుకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముడిమడుగుల తిరుపతి, జిల్లా ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎం.ఉదయ్‌బాబు, విద్యాశాఖ ఎఫ్ఏవో జాడి దేవాజీ, సంఘ జిల్లా కార్యదర్శి చిలుకూరి రవీందర్, మండల కార్యదర్శి బామండ్లపల్లి స్వామి, మోహన్ నూతన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజేతలై.. విధుల్లో చేరి!



న్యూస్‌టుడే, ఆసిఫాబాద్ అర్బన్

డీఎస్సీ నియామకాలు చకచకా జరుగగా.. ఈ విజయదశమి విజేతల జీవితాల్లో తీపి జ్ఞాపకాలను అందించింది. పరీక్ష నిర్వహించిన 61 రోజుల్లోనే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ పూర్తయి నియామక పత్రాలు పొందడంతో.. సంబంధిత కుటుంబాల్లో ఆనందానికి అవధుల్లేవు. సీఎం చేతులమీదుగా అందుకొన్న మరునాడే గురువారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి నియామక పత్రాలతో వచ్చి జాయినింగ్ రిపోర్టు ఇచ్చారు. వారు ప్రభుత్వ సర్వీసులో చేరినట్లయింది. 10వ తేదీ నుంచి వారి సర్వీసు ప్రారంభంతోపాటు వేతనాలు అందుకోనున్నారు. కోరుకున్న ఉద్యోగంలో చేరిన వారు పండగలాదిగా కార్యాలయానికి తరలివచ్చి తోటి వారితో సంబరాన్ని పంచుకున్నారు. పోస్టింగు ఎక్కడ వస్తుందని చర్చించుకున్నారు. పలువురు కలెక్టర్ వెంకటేష్ దోత్రేను కలిశారు. వారికి ఆయన మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

261 మంది అందజేత

జిల్లాలో వివిధ కేటగిరీలకు చెందిన 341 ఉపాధ్యాయుల పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా.. వివిధ కారణాలతో 270 మందికి ఈ నెల 9న హైదరాబాద్‌లో నియామక పత్రాలు ఇచ్చారు. పత్రాలు అందుకున్న వారు ఈ నెల 10న విధుల్లో చేరాలని ఆదేశాలు ఉండటంతో.. డీఈవో కార్యాలయానికి పరుగున వచ్చి సాయంత్రం వరకు 261 మంది జాయినింగ్ రిపోర్టులు అందజేశారు. వీరిలో 176 మంది ఎస్జీటీలు ఉండగా 94 మంది స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు. మిగిలి పోయిన 71 పోస్టుల్లో 13 పోస్టులు కోర్టు వివాదం కారణంగా పీహెచ్‌సీ కోటా, అభ్యర్థుల ప్రవీణ్యత పత్రాల వివాదంతో భర్తీ కాలేదు. మిగిలిన 58 పోస్టుల్లో 43 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు లభించలేదని చెబుతున్నారు. ఇందులో ఉర్దూ, హిందీ, బెంగాలీ మాధ్యమ పోస్టులు ఉన్నాయి. 15 స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్జీటీ పోస్టులు కోర్టు వివాదం కారణంగా పెండింగ్ పెట్టినట్లు సమాచారం.

● డీఈవో కార్యాలయానికి తరలివచ్చిన కొత్త గురువులు..

మొత్తం పోస్టులు :	341
నియామక పత్రాలు పొందిన వారు :	270
ఎస్జీటీలు :	176
ఎస్ఏలు :	94
మిగిలిన పోస్టులు :	71



డీఈవో కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎంపికైన ఉపాధ్యాయులు




కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయానికి వచ్చిన నూతన ఉపాధ్యాయులు

పాఠశాలలు కళకళ..

విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు పాఠశాలలు పునః ప్రారంభంలోపే వెబ్ కౌన్సెలింగ్ ద్వారా పాఠశాలలు కేటాయించే కసరత్తు విద్యాశాఖ చేపట్టినట్లు సమాచారం. ఈలోగా గతంలో బదిలీ అయి రిలీవర్ లేని కారణంగా పాత స్థానాల్లోనే పనిచేస్తున్న ఉపాధ్యాయులను బదిలీ స్థానాలకు పంపించి ఆ స్థానాలను ఖాళీగా చూపించనున్నారు. దూర సేవలు తర్వాత కొత్తవారు కోరుకున్న ఖాళీ స్థానాల్లో బదులు పొందేలా ఆలోచనతో విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. కాగా జిల్లాలోని పాఠశాలలు యువ గురువులతో కళకళలాడటంతో పాటు ఉపాధ్యాయుల కొరత తీరనుంది. ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ భర్తీతో విద్యార్థుల చదువులు గాడిన పడనున్నాయి. కొత్త జిల్లాల ప్రాతిపదికన నియామకాలు జరగడంతో జిల్లాలోని నిరుద్యోగ యువతకు మేలు జరిగింది. వారి కుటుంబాల్లో ఈ విజయ దశమి సంతోషాన్ని నింపింది.

ఆటే శ్వాస.. ధ్యాస!

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ క్రీడావిభాగం



● రంజీ ట్రోఫీ పోటీలకు హిమతేజ ఎంపిక
● ఉమ్మడి జిల్లా నుంచి అవకాశం దక్కించుకున్న తొలి క్రికెటర్

ఈ కాలం కుర్రాళ్లంటే స్మార్ట్‌ఫోన్లు, సరదాలు, స్నేహితులు, షికార్లు ఉంటాయి. కానీ ఆ యువకుడికి మాత్రం మైదానమే లోకం. క్రికెట్ బ్యాట్, బాల్, స్టంప్స్, గ్లౌవ్స్, అతడి నేస్తాలు. ఆస్వాదించే వయసులో అన్నింటిని వదిలేసి.. లక్ష్యం వైపే ఏకాగ్రతను కేంద్రీకరించాడు. 12 ఏళ్లు మైదానంలో శ్రమించి కలను నిజం చేసుకున్నాడు. బీసీసీఐ నిర్వహించే అత్యంత ప్రతిష్ఠాత్మక రంజీ ట్రోఫీ క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. హైదరాబాద్ జట్టు సభ్యుడిగా శుక్రవారం జింఖానా మైదానం(హైదరాబాద్)లో అరంగేట్రం చేయనున్నాడు. అతడే కొడిమెల హిమతేజ. కష్టపడితే ఏ రంగంలోనైనా విజయం వరిస్తుందని నిరూపించి అందరికీ ఆదర్శంగా నిలిచారు.

క్రికెట్ మెరుపుల్లో కొన్ని...

- 2012లో అండర్-14 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో 6 మ్యాచుల్లో 278 పరుగులు.
- 2012లో అండర్-14 ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో 6 మ్యాచుల్లో 278 పరుగులు.
- 2013లో కశ్మీర్‌లో అండర్-14 ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి పోటీల్లో మూడు అర్ధ సెంచరీలు.
- 2017లో అండర్-16, 2019లో అండర్-19 హెచ్‌సీఏ పోటీల్లో పరుగుల వర్షం కురిపించాడు.
- 2023లో అండర్-23 సీకే.నాయుడు స్మారక పోటీలకు హైదరాబాద్ జట్టు సారథిగా ఎంపిక. పోటీల్లో అత్యధిక పరుగులు చేసి నేషనల్ క్రికెట్ అకాడమీ(ఎన్‌సీఏ) గుజరాత్ శిక్షణ శిబిరానికి ఎంపిక.
- 2023లో హెచ్‌జీఏ - న్యూజిలాండ్-ఎ జట్ల పోరులో 49 బంతుల్లో 85 పరుగులు.
- 2024లో బుచ్చిబాబు స్మారక పోటీల్లో ప్రతిభ కనబరిచి రంజీ ట్రోఫీ పోటీలకు ఎంపిక.

చదువులో, క్రికెట్‌లో మేటి..

ఆదిలాబాద్‌కు చెందిన కొడిమెల మధుసూదన్-కామేశ్వరి దంపతుల కుమారుడు హిమతేజ. చిన్నప్పటి నుంచి చదువులో, క్రికెట్‌లో మేటి. పది, ఇంటర్ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యాడు. బాబాయ్ వేణుతో కలిసి గల్లీలో ఎడమచేతితో ఆడడం, గంటల తరబడి ఔట్ కాకుండా ఉండటంతో ఆయనను జేసీ క్రికెట్ అకాడమీలో చేర్పించారు. సరైన వసతులు లేకున్నా సాధన చేశాడు. ఉమ్మడి జిల్లా నుంచి రంజీ ట్రోఫీ పోటీలకు తొలి క్రికెటర్‌గా ఎంపికయ్యాడు.

ఈ ప్రయాణంలో ఎన్నింటినో త్యాగం చేశాడు

- మధుసూదన్-కామేశ్వరి, తల్లిదండ్రులు

హిమతేజ రంజీ ట్రోఫీ పోటీలకు ఎంపికైనందుకు చాలా గర్వంగా ఉంది. కష్టపడిన దానికి ఫలితం దక్కింది. ఈ క్రికెట్ ప్రయాణంలో మా బాబు ఎన్నింటినో త్యాగం చేశాడు. మేము మా బాబుతో గడిపింది చాలా తక్కువే. క్రీడా భవిష్యత్తు గురించి ఆలోచించి ప్రోత్సహించాం. ఎప్పుడూ చూసినా మైదానంలో సాధన చేసే హిమతేజను కలవాలంటే రాత్రి వేళల్లో మాత్రమే సాధ్యమయ్యేది. అది కూడా రెండు గంటలే మాట్లాడుకునేవాళ్లం.

భారత జట్టుకు ఆడటమే నా కల..

- హిమతేజ

రంజీ ట్రోఫీ పోటీలకు హైదరాబాద్ జట్టుకు ఎంపిక అయ్యానన్న విషయం ఇప్పటికీ కలగానే అనిపిస్తుంది. ఇదే స్ఫూర్తిని కనబరిచి రంజీ ట్రోఫీ పోటీల్లో రాణిస్తా. భారత జట్టుకు ఎంపికే లక్ష్యంగా పెట్టుకున్నా. రంజీకి ఎంపిక కావడంతో ఇన్నేళ్ల కష్టానికి ఫలితం దక్కింది.

ఉత్సాహంగా పరుగు



గెలిచిన యువకుడికి బహుమతి అందజేస్తున్న ఆర్మీ ఉద్యోగులు, పోలీసులు

దహెగాం, న్యూస్‌టుడే : మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఆర్మీ ఉద్యోగులు గురువారం 5కే రన్ నిర్వహించారు. మండలంలోని పీకలగుండం గ్రామం నుంచి కన్నెపల్లి మండలం చింతపుడి గ్రామం వరకు పరుగు పందెం ఏర్పాటు చేశారు. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతి అమర్‌గొండ గ్రామానికి చెందిన ఎల్కరి రమేష్‌కు రూ.5 వేలు, ద్వితీయ బహుమతి చేడ్వాయి గ్రామానికి చెందిన సాద్గరి రమేష్‌కు రూ.2 వేలు, తృతీయ బహుమతి ఇట్యాల గ్రామానికి చెందిన అశోక్‌కు రూ.1000 నగదును ప్రదానం చేశారు. కార్యక్రమంలో పోలీసులు, యువకులు పాల్గొన్నారు.



కవ్వాల్ అటవీ ప్రాంతంలో అంతర్జాలం వస్తున్న చోట జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న ఏపీవో దేవానందం

సాంకేతిక సేవలు అందక తిప్పలు!

జైనూర్ మండల కేంద్రంలో జరిగిన ఘర్షణ కారణంగా.. ఏజెన్సీ మండలాలైన జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్‌లలో అంతర్జాల సేవలు నిలిపివేసిన విషయం విదితమే. అయితే ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు సాంకేతిక సేవల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురువారం జిల్లా డీఆర్‌డీవో దత్తారాం జూమ్ మీటింగ్ నిర్వహించారు. దీంతో లింగాపూర్ మండల ఏపీవో దేవానందం కవ్వాల్ అటవీ ప్రాంతంలో అంతర్జాల సేవలు వస్తున్న చోటకు వెళ్లి హాజరయ్యారు. ఈక్రమంలో మీటింగ్ నిర్వహిస్తుండగా 'న్యూస్‌టుడే' క్లిక్ మనిపించింది. **- న్యూస్‌టుడే, లింగాపూర్**

దేశీదారు స్వాధీనం

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: జిల్లాలో దేశీదారు విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్న నేపథ్యంలో ఈ నెల 9న 'ఈనాడు'లో 'దేశీదారుణం' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన హైదరాబాద్ ఎస్‌టీఎఫ్ అధికారి ప్రదీప్‌రావు, ఎస్సై బాలరాజు బృందం సభ్యులు.. గురువారం కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ సమీపంలో దేశీదారు అమ్మకాలు చేపడుతున్న మల్లయ్య, సోనం, స్వీకర్‌లపై కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి దేశీదారు (90 ఎంఎల్) 266 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రలో రూ.50కి కొనుగోలు చేసి కాగజ్‌నగర్‌లో రూ.70కి విక్రయాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

వందనం

ఉమ్మడి జిల్లాలో ధాన్యం సేకరణకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. సన్న రకాలు సాగు చేసిన రైతులకు మద్దతు ధరపై క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించిన నేపథ్యంలో సన్నరకాలు, దొడ్డు ధాన్యం కొనుగోలుకు వేర్వేరు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సన్న రకాలను గుర్తించేందుకు ఈ సీజన్‌లో సాంకేతికతను వినియోగించుకోనున్నారు. ఉమ్మడి జిల్లాలో 3.46 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇందులో సన్న రకాల సాగు ఎక్కువగా ఉండటంతో ధాన్యం సేకరణకు అవసరమయ్యే కేంద్రాల ఏర్పాటులో అధికారులు నిమగ్నమయ్యారు.




సన్నాల కొనుగోలులో సాంకేతికత

● ప్రత్యేక పరికరంతో గుర్తింపు

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం

సన్న రకాలకు ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు ప్రకటించడంతో వాటి సేకరణలో అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. నాణ్యతతో పాటు సన్నరకాలను సాగు చేసే రైతుల నుంచి ధాన్యం గుర్తించేందుకు సాంకేతికతను పాటించనున్నారు. ప్రభుత్వం 33 రకాల వరి ధాన్యాలను సన్నాలుగా గుర్తించింది. జిల్లాల వారీగా అక్కడి నేల, వాతావరణం, సాగు నీటి సౌకర్యం తదితర వాటి మేరకు మంచిర్యాల జిల్లాలో 1008, సాయిరాం, చిట్టిపొట్టి రకాలు, నిర్మల్ జిల్లాలో జైశ్రీరాం, సూపర్‌ఆమాన్, హెచ్‌ఎంటి రకాలు సాగు చేస్తుండగా, కుమురం భీం జిల్లాలో శ్రీ101, జైశ్రీరాం, ఆర్‌ఎన్‌ఆర్ రకాలు సాగు చేస్తున్నారు. వీటిని గుర్తించేందుకు ఈ సీజన్‌లో గ్రెయిన్‌కాలిపర్ (డయల్ మైక్రోమీటర్)ను ఉపయోగించనున్నారు. కేంద్రానికి రెండు పరికరాల చొప్పున ఇవ్వనున్నారు. ఈ యంత్రంతో గింజ పొడవు, వెడల్పు కొలుస్తారు. నిర్దేశిత ప్రమాణాల మేరకు ఉంటేనే కొనుగోలు చేస్తారు. ధాన్యం కొనుగోలుకు వేర్వేరు కేంద్రాలుగా ఏర్పాటు చేస్తున్నా.. కొనుగోలు చేసిన తర్వాత సంచులను సులువుగా గుర్తించేందుకు సన్నాల సంచులను ఎరుపు, దొడ్డురకాలను ఆకుపచ్చ దారంతో కుట్టేలా చర్యలు తీసుకుంటున్నారు.



గ్రెయిన్‌కాలిపర్


నిర్ధారణే సమస్య

వరి ధాన్యం సేకరణలో సన్నధాన్యం నిర్ధారణే సమస్యగా ఉంది. నిబంధనల మేరకు బియ్యం గింజ పొడవు 6 మిల్లీమీటర్ల కన్నా తక్కువగా ఉండాలి. వెడల్పు 2 మి.మీలకు మించకుండా, పొడవు, వెడల్పు నిష్పత్తి, 2.5 కన్నా ఎక్కువ ఉండే వాటికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. నాణ్యత పరీక్ష కోసం పొట్టు తీసిన గింజలను తేమ శాతం 17 శాతం కన్నా తక్కువ ఉన్న పరిస్థితుల్లోనే నిర్ధారించాలి. ఇప్పటి వరకు కేంద్రం ఏ, బీ రకాలంటూ మద్దతు ధరలను ప్రకటించింది. సన్న రకాలను ప్రభుత్వం సేకరించేది కాదు. మార్కెట్లో ధర తక్కువగా ఉంటే దొడ్డు రకాల మాదిరిగానే సన్న రకాలను రైతులు విక్రయించుకునే పరిస్థితి ఉండేది. ఈ సీజన్‌లో తొలిసారి సన్నరకాలను ప్రభుత్వం కొనుగోలు చేస్తుండటంతో ఏర్పాట్లపై అధికారులు కసరత్తు చేస్తున్నారు.

అపురూపం.. సీతాకోక చిలుకల అందం



ఒక్కటిగా సీతాకోక చిలుకలు




చూడముచ్చటగా..

● బుగ్గ ఆలయ సమీపంలో పార్కు ఏర్పాటుకు చర్యలు

కాసిపేట మండలంలోని ధర్మారావుపేట సెక్షన్ పరిధి బుగ్గ ఆలయం సమీపంలో సీతాకోక చిలుకల పార్కు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో అనేక సీతాకోక చిలుకలను గుర్తించినట్లు చెప్పారు. అటవీ ప్రాంతాలకు ఆనుకొని ఉన్న ఆలయాలు, పురాతన నిర్మాణాల ప్రదేశాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కాసిపేట మండలంలోని ముత్యంపల్లి అటవీ సెక్షన్ పరిధిలో రంగురంగుల సీతాకోక చిలుకలు కనిపిస్తున్నాయి. ఇక్కడికి వచ్చేవారు వీటిని చూస్తూ మురిసిపోతున్నారు. ఈ విషయమై డిప్యూటీ రేంజర్ ప్రవీణ్‌నాయక్‌ను సంప్రదించగా 'బెల్లంపల్లి మండలంలోని కన్నాల శివారు బుగ్గ ఆలయం రెండు గుట్టల నడుమ 2 వేల ఏళ్ల కిందట వెలిసిందని పూర్వీకులు చెబుతున్నారు. దీన్ని పర్యాటక ప్రాంతంగా మార్చేందుకు అనువైన వనరులు ఉన్నాయి. అటవీశాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే సీతాకోక చిలుకల పార్కు ఏర్పాటునకు ప్రణాళిక సిద్ధం చేశాం. త్వరలో పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొస్తాం' అని తెలిపారు. - న్యూస్‌టుడే, కాసిపేట



ఆకట్టుకునేలా..



నీటకుంట వద్ద గుంపులుగా..

మహాగౌరి అవతారం.. పులకించిన భక్తజనం



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు



మహాగౌరి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారు

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం అమ్మవారు మహాగౌరి అవతారంలో దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు చేశారు. తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తొగుటా మాదవనంద సరస్వతీ స్వామి దర్శించుకొని పూజలు చేశారు. ఆర్యవైశ్య సత్రం ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాన్ని పంచిపెట్టారు. బాసర ఆర్జీయూకేటీ విద్యార్థులు వీణ వాయించారు. హైదరాబాద్‌కు చెందిన విద్యార్థులు నృత్య ప్రదర్శన చేశారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు నిర్మల్ విద్యార్థులు



విద్యార్థులతో ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్, న్యూస్‌టుడే : అసోం రాష్ట్రంలోని గువహటి త్వరలో జరగనున్న జాతీయ స్థాయి యోగా పోటీలకు నిర్మల్ జిల్లా విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో జిల్లాలోని బాసర నాగభూషణ విద్యాలయం విద్యార్థులు ఎ.చరణ్, డి.అవినాష్‌లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి జాతీయస్థాయిలో పాల్గొననున్నారు. వీరితోపాటు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను గురువారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జానకి షర్మిల అభినందించారు. యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అన్నపూర్ణ ముధుల్కర్, యోగా మాస్టర్ మల్లేశ్, స్కూల్ ప్రిన్సిపల్ బాబురావు వైస్ ప్రిన్సిపల్ సులోచన, నేత్ర వైద్యుడు కృష్ణంరాజు పాల్గొన్నారు.

నేడు నాందేడ్ నుంచి ఆమ్లాకు ప్రత్యేక రైలు

ఎదులాపురం, న్యూస్‌టుడే : ధమ్మ పరివర్తన దినోత్సవం నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని పురస్కరించుకొని శుక్ర, శనివారాలు నాందేడ్-ఆమ్లా-నాందేడ్ ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రజా సంబంధాల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. శుక్రవారం ప్రత్యేక రైలు(నెం.07025) నాందేడ్ నుంచి రాత్రి 9 గంటలకు బయలుదేరి ముద్ఖేడ్, భోకర్, హిమాయత్‌నగర్, సహస్రకుండ్, కిన్వట్, ఆదిలాబాద్, పిప్పల్‌కుటి, నాగ్‌పూర్, ఆమ్లాకు శనివారం ఉదయం 11 గంటలకు చేరుకుంటుందన్నారు. శనివారం ప్రత్యేక రైలు(నెం.07026) ఆమ్లా నుంచి రాత్రి 8 గంటలకు బయలుదేరుతుందన్నారు. తిరుగు ప్రయాణంలో అవే స్టేషన్ల ద్వారా ఆదివారం ఉదయం నాందేడ్ చేరుకుంటుందన్నారు. ప్రత్యేక రైలులో 17 జనరల్ బోగీలతో కలిపి మొత్తం 19 కోచ్‌లు ఉంటాయని పేర్కొన్నారు.

అవును అవి అవసరమే..!!

● వృత్తులు.. పద్ధతులు పిల్లలకు తెలిసుండాలి

మామడ, న్యూస్‌టుడే: చదువుల నిమిత్తం పిల్లలు చిన్నప్పటి నుంచే వసతిగృహాల్లో ఉంటున్నారు. సెలవులొస్తేనా ప్రత్యేక తరగతుల పేరిట అక్కడే ఉండిపోతున్నారు. ఎప్పుడో ఒకప్పుడు సొంతూరుకొచ్చినా తల్లిదండ్రులు పని ఒత్తిడి వల్ల వారితో గడపలేకపోతున్నారు. అమ్మానాన్నలతో పిల్లలకు ఉండాల్సిన ఆత్మీయతలో అంతరం కనిపిస్తోంది. పండగల వేళ, ఇతర సమయాల్లో ఇంటికొచ్చినప్పుడు వాళ్లతో ఎక్కువ సమయం గడపడం, తల్లిదండ్రుల వృత్తి, ఉద్యోగాలపై అవగాహన కల్పించడం వంటివి ఎంతో అవసరం..

ఇదే కదా ప్రధానమని..

నిర్మల్‌లో నివాసముండే మన్మోహన్‌రెడ్డి స్వగ్రామం సారంగాపూర్ మండలం చించోలి. సొంతూరులో సేంద్రియ, గోఆధారిత వ్యవసాయంలో ఆయనకు మంచి గుర్తింపు ఉంది. వారికి ఇతర వ్యాపారాలున్నా సాగుకు అత్యంత ప్రాధాన్యమిస్తారు. తమ ఉన్నతిలో వ్యవసాయానిదే ప్రధాన పాత్ర అని చెప్పే మన్మోహన్‌రెడ్డి సెలవుల్లో కుమారుడు కృషిల్‌రెడ్డిని చేనుకు తీసికెళ్తారు. సాగు విధానాన్ని చెబుతుంటారు. తోటకు తీసికెళ్లి ఆవులు, ఇతర జీవాలతో సాగుకు ఉన్న అనుబంధాన్ని ఓ పాఠంలా వివరిస్తుంటారు. ఇలా చేయడం వల్ల ఆ చిన్నోడికీ ఇప్పటి నుంచే చేనుచెలకలపై ఆసక్తి పెరిగింది.



చేనులో తండ్రి మన్మోహన్‌రెడ్డితో కృషిల్

ఉల్లాసంగా ఉత్సాహంగా..

మామడ మండలం గాయిద్‌పల్లికి చెందిన రమేష్ రాఠోడ్ ఉత్తరాఖండ్‌లోని ఓఎన్‌జీసీ ఫైనాన్స్ విభాగంలో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆయన కుమారుడు ధనుష్ ఐఐటీ గువహటిలో బీటెక్, కుమార్తె ఈశిత డెహ్రాడూన్‌లో పదో తరగతి చదువుతున్నారు. వీలున్నప్పుడల్లా సొంతూరుకు వెళ్తాం.. ప్రకృతిలో గడిపేందుకు ఆసక్తి చూపిస్తాం. మా సంప్రదాయ వస్త్రధారణను పిల్లలు ఇష్టపడేలా చూస్తాం. చేలకు తీసికెళ్లి పంటల సాగుపైనా అవగాహన కల్పిస్తామని తల్లిదండ్రులు రమేష్-రూప సొంతూరిపై మమకారాన్ని, పిల్లలకు మూలాలు తెలియజేయాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు.



సెలవులకు సొంతూరుకొచ్చినప్పుడు పిల్లలతో రమేష్ రాఠోడ్-రూప దంపతులు

పనులన్నీ రావాలి కదా..

నిర్మల్ పట్టణం గాయిద్‌పల్లికి చెందిన రవీందర్-నీల దంపతుల పెద్ద కూతురు హిమబిందు ప్రయాగ రాజ్ ట్రిపుల్ ఐటీలో, చిన్న కూతురు సింధూజ హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నారు. చిన్నప్పటి నుంచి వసతిగృహాల్లో ఉంటున్నారని.. సెలవులకు ఇంటికొస్తే వారి పనులు వారు చేసుకునేలా చూస్తానంటున్నారు తల్లి నీల. వంటలు, ఇతర పనులు నేర్చుకునేలా ప్రోత్సహిస్తుంటామని చెప్పారు. అన్ని పనులు తమకు కూడా ఆనందమే కదా అంటుంటారు ఆ పిల్లలు.



కూతురు సింధూజతో వంట చేయిస్తున్న తల్లి నీల

వృత్తిపై అవగాహన ఉండాలని..



తమ తండ్రులు కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కుతుంటే చూస్తున్న పిల్లలు

మామడ మండలం దిమ్మదుర్తికి చెందిన రేవెల్లి శ్రీనివాస్‌గౌడ్, పొన్నం శ్రీనివాస్‌గౌడ్ వృత్తిరీత్యా గీత కార్మికులు. ఊళ్లోని తాటి చెట్లు గీస్తూ జీవనం సాగిస్తున్నారు. వారి పిల్లలు అచ్యుత్‌గౌడ్, మనూష హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతున్నారు. దసరా సెలవులకు ఇంటికొచ్చిన ఆ ఇద్దరినీ అలా తాటి వనానికి తీసికెళ్లి నిత్యం వారు చేసే పనిని ప్రత్యక్షంగా చూపించడం, తాతల కాలం నుంచి ఉపాధి ఇస్తున్న ఆ రంగం గురించి వివరించారు. కులవృత్తులు కనుమరుగవుతున్న తరుణంలో ముందుచూపుతో చేసే ఇలాంటి చిన్న పాటి పనులతో వచ్చే తరాలకూ వృత్తి ప్రాధాన్యం తెలిసొస్తుందన్నది వారి అంతరంగం..

ఆలోచించాల్సిన విషయం ఇది..



పరీక్ష పత్రాలను దిద్దుతున్న ఓ ఉపాధ్యాయురాలు ఒక విద్యార్థి రాసిన సమాధానం చూసి కన్నీళ్లు పెట్టుకుంటారు. 'మీరు ఏం కావాలనుకుంటున్నారు' అనే వ్యాసరచన అంశంపై ఓ విద్యార్థి 'నేను స్మార్ట్ ఫోన్ అవ్వాలి అని రాస్తాడు. ఆ విద్యార్థి అమ్మానాన్నలు సెల్‌ఫోన్‌ను చాలా ప్రేమిస్తారు. దానిని శ్రద్ధగా ఇష్టంగా చూసుకుంటారు. నాన్న ఆఫీసు నుంచి వచ్చినప్పుడు స్మార్ట్‌ఫోన్ రిలాక్స్ ఇస్తుంది. ముఖ్యమైన పనుల్లో ఉన్నా ఫోన్ రింగ్ అవ్వగానే జవాబు ఇస్తారు. నేను పిలిచినా పట్టించుకోరు... తల్లిదండ్రులు చరవాణిలో నిమగ్నమై పిల్లలను నిర్లక్ష్యం చేస్తున్నారన్నది ఆ వ్యాసంలోని సారాంశం.. ఇది ఎప్పటి నుంచో వైరల్ అవుతోంది. చాలా మంది ఇళ్లలో కనిపించే ఈ అంతరం కనిపిస్తోంది.



కప్పుకొన్న మంచు దుప్పటి

రెండు రోజులుగా వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉదయం కాస్త ఎండ కాస్తూనే.. మధ్యాహ్నం వర్షం కురుస్తోంది. రాత్రి వేళ చలి ప్రారంభమై తెల్లవారుజామున మంచు కురుస్తోంది. ఆదిలాబాద్ పట్టణాన్ని గురువారం ఉదయం మంచు కమ్మేసింది. - ఈనాడు, ఆదిలాబాద్

ముఖ్యమంత్రిని కలిసి.. సమస్యలు విన్నవించి

ఆసిఫాబాద్, ఉట్నూరు గ్రామీణం న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలో నెలకొన్న సమస్యలు, ఆదివాసీల అభ్యున్నతికి పాటుపడాలని కోరుతూ.. హైదరాబాద్‌లో గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కలిసి వినతిపత్రం అందజేశారు. శాలువా కప్పి సత్కరించారు. షెడ్యూల్డ్ ప్రాంతాల పరిరక్షణ, చట్టాల అమలు, జైనూర్ ఘటన బాధితురాలి కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థికసాయం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని విన్నవించారు. ఐటీడీఏ ద్వారా ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని, ఆదివాసీ గ్రామాలకు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో గతంలో మంజూరైన డీఎంఎఫ్‌టీ, ఎస్‌డీఎఫ్, సీడీపీ పనులకు సంబంధించి నిధులు విడుదల చేయాలన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దండె విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి సత్తు మల్లేష్ తదితరులు ఉన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, చిత్రంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దండె విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



పొలాలకు సాగునీటినందించే ప్రధాన కాలువ

నిండుగా జలాలు.. కళకళలాడుతున్న పొలాలు

● 29 టీఎంసీల నీరు గోదావరి పాలు

కడెం, న్యూస్‌టుడే : కడెం నారాయణరెడ్డి జలాశయం ఆయకట్టు పరిధిలోని ఆరు మండలాల రైతులకు కల్పతరువు. కడెం నిండిందంటే ఆ ప్రాంత రైతుల ఆశలు పండినట్లే. కడెం బాగుండాలని, నిండా నీరుండాలని ఆయకట్టు రైతులు కోరుకుంటుంటారు. ఈ వానాకాలం రైతుల కళలు పండేలా ప్రాజెక్టు ఆశాజనకంగా నిండడమే కాకుండా అదనంగా వచ్చిన నీటిని దిగువకు వదిలారు. అక్టోబరు మొదటి వారం ముగిసినా జలాశయంలో గరిష్ఠ మట్టానికి చేరువగా నీటిమట్టం ఉండటంతో వారబందీ నిబంధనలేవీ పెట్టకుండానే అధికారులు ఆయకట్టుకు పూర్తిస్థాయిలో కాలువలకు సాగునీటిని అందిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 700 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 700.7 అడుగుల వద్ద ఉంది. ఇన్‌ఫ్లో 300 క్యూసెక్కుల వరకు మాత్రమే వస్తోంది.

ఎదుగుతున్న చేలు

కడెం కాలువల ద్వారా పొలాలకు నిరంతరంగా సాగునీరందుతోంది. ప్రాజెక్టు నిండా జలాలు ఉండటంతో చివరి ఆయకట్టు వరకూ నీరందేలా కాలువలకు నీటిని విడుదల చేస్తున్నారు. మాకు నీరు రాలేదనే ఆరోపణలేమీ లేకుండా రైతుల పొలాలు ఎదుగుతున్నాయి. కాలువల్లో గలగలా నీరు పారుతుంటే పంట పొలాలు కళకళలాడుతూ ఏపుగా ఎదుగుతున్నాయి. ప్రాజెక్టు కింద మొత్తం 60 వేల ఎకరాల పంటలు సాగవుతున్నట్లు అధికారుల అంచనాగా ఉంది. ప్రధాన కాలువకు ఉన్న 42 ఉపకాలువల ద్వారా పొలాలకు సాగునీరందుతోంది. పొలాలన్నీ పొట్ట దశలో ఉండగా మరికొన్ని పొలాలు గొలకలు వేస్తున్నాయి. అక్కడక్కడ తెగుళ్లు సోకిన పొలాలకు రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకుంటూనే దిగుబడిపై ఆశలు పెంచుకుంటున్నారు.

నాలుగింతల నీరు గోదావరికి..

కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 7.6 టీఎంసీలు. ఈ వర్షాకాలం ప్రారంభం నుంచి కడెంకు మొత్తం 41 టీఎంసీల వరదనీరొచ్చింది. అందులోంచి వరద గేట్ల ద్వారా 29.088 టీఎంసీల నీటిని గోదావరికి వదిలారు. అంటే సుమారు కడెంలో నిల్వ ఉండే నీటికి నాలుగింతల నీరు గోదావరికి వదిలారన్నమాట. కాలువలకు ఇతరత్రా 4.8 టీఎంసీల నీటిని విడుదల చేశారు ప్రస్తుతం కడెంలో 7.511 టీఎంసీల నీరుంది. గతేడాదికంటే ఇపుడు నీటిమట్టం ఆశాజనకంగానే ఉండటంతో వానాకాలం పంట పూర్తయ్యాక రెండో పంటకూ సగం ఆయకట్టుకైనా నీరందుతుందనే ఆశాభావాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.



కడెం కింద సాగవుతున్న పొలాలు

విరుల పండగ.. లాభాలు దండిగా..

-న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం



ఎకరం తోటలో పది టన్నులకు పైగానే..

ప్రకృతిని, పూలను దేవతలుగా కొలుస్తూ పల్లె, పట్నం అనే తేడా లేకుండా.. కొనసాగే పండగ బతుకమ్మ. రంగురంగుల పూలను సేకరించి, బతుకమ్మగా పేర్చి, మహిళలు ఒక చోట చేరి ఆటపాటలతో సాగుతుంది. మరో వైపు వరుసగా దసరా, దీపావళి, ఆ తర్వాత కార్తికమాసం పూజలు, శుభకార్యాలు ఎక్కువగా ఉండటంతో ఈ నెల నుంచి మరో రెండు నెలల పాటు పూలకు డిమాండ్ బాగా ఉంటుంది. బంతి, చామంతి కిలో రూ.100 వరకు ఉన్నాయి. పండగలు, శుభకార్యాలను దృష్టిలో పెట్టుకొని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కొంత మంది రైతులు పూలను సాగు చేసి లాభాలను గడిస్తున్నారు. ఇతర రైతులకు భిన్నంగా పూల సాగుకు ప్రత్యేకంగా కొంత భూమిని కేటాయించడంతో పాటు సీజన్ల వారీగా పూలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

పూల తోటలు సాగు చేసే రైతులు లాభాలు గడిస్తున్నారు. ఎకరం భూమిలో బంతి పూల సాగుకు రూ.40 వేలు పెట్టుబడి అవుతుండగా, పది టన్నులకు పైగా దిగుబడి వస్తుంది. సీజన్‌లో కిలో రూ.100కు పైగా ధర ఉంటుంది. రైతులు రోజు వారీగా పూలు తెంపి స్థానిక మార్కెట్లో విక్రయిస్తే లాభం ఉంటుంది. టోకులో విక్రయిస్తే కిలో ధర రూ.60 ఉంటుంది. డిమాండ్‌ను బట్టి పండగల సమయంలో ధర ఇంకా ఎక్కువే ఉంటుంది. జిల్లాల వారీగా పూలు సాగు చేసే రైతులు తక్కువ సంఖ్యలో ఉండటంతో స్థానిక మార్కెట్లో విక్రయిస్తారు. దూర ప్రాంతాలకు వెళ్లే అవసరం ఉండదు.



మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం గోపాల్‌పూర్‌కు చెందిన రైతు శ్రీకాంత్ బంతి పూలు సాగు చేస్తున్నారు. పూల డిమాండ్‌ను బట్టి దిగుబడి వచ్చేలా ప్రణాళిక రూపొందించుకొని సాగు చేయడం వల్ల ఆశించిన లాభాలు గడించే అవకాశం ఉందని తెలిపారు. స్థానిక మార్కెట్లో విక్రయించేలా ఏర్పాట్లు చేసుకొని అధిక లాభం పొందుతున్నారు.

● తక్కువ ఖర్చు.. రోజువారీ ఆదాయం



☛ కుమురం భీం జిల్లా దహెగాం మండలం పి.పి.రావు కాలనీకి చెందిన రైతు సురేష్ మల్చింగ్ పద్ధతిలో పూల సాగు చేస్తున్నాడు. ఎకరం భూమిలో రెండు రకాల బంతి పూలు సాగు చేస్తున్నారు. సరిగ్గా బతుకమ్మ పండగ వచ్చే సరికి దిగుబడి వచ్చేలా చూసుకుంటారు. ఎకరానికి పది టన్నులకు పైగా దిగుబడి వస్తుంది. పూలను విక్రయించడానికి ఎక్కడికి వెళ్లే అవసరం లేదు. తోట దగ్గరికే వచ్చి కొనుగోలు చేసి తీసుకెళుతున్నారని వివరించారు.



☛ ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం పొన్నారికి చెందిన రైతు దేవిదాస్ తనకు ఉన్న భూమిలో రెండు ఎకరాల్లో కూరగాయలు, పూలు సాగు చేస్తున్నారు. బతుకమ్మ పండగ సమయంలో పూలకు ఎక్కువ డిమాండ్ ఉండటం, పైగా ఆదిలాబాద్ జిల్లాలో ఈ పండగ నెల రోజులు కొనసాగుతుంది. డిమాండ్‌కు తగ్గట్టుగా దిగుబడి వచ్చేలా వారం రోజుల తేడాతో విత్తుకోవడంతో రోజు వారీగా పూల విక్రయాలుండటంతో లాభాలు గడించే అవకాశం ఉందని దేవిదాస్ తెలిపారు.



☛ నిర్మల్ జిల్లా బాసర మండలం బిద్రెల్లికి చెందిన ఆర్.మహేశ్ ఎకరం భూమిలో పూలు సాగు చేస్తున్నాడు. బతుకమ్మ పండగ సమయానికి బంతిపూలు వచ్చేలా జూన్ నెలలో పంట సాగును ప్రారంభిస్తే.. సెప్టెంబరు నుంచి దిగుబడి మొదలవుతుందని తెలిపారు. చాలా మంది చేను దగ్గరికి వచ్చి కొనుగోలు చేసి తీసుకెళుతుంటారని, ఎక్కువ దిగుబడి వస్తే.. నిజామాబాద్ మార్కెట్లో విక్రయిస్తామని ఆయన తెలిపారు.



ఉమ్మడి జిల్లాలో పూల సాగు(ఎకరాల్లో)			
బంతి : 258	చామంతి : 115	మల్లె : 68	లిల్లీ : 52


అల్లుడి మరణం తట్టుకోలేక.. అత్త హఠాన్మరణం



వచ్చలబాయి

భీంపూర్, న్యూస్‌టుడే : రెండు రోజుల కిందటే అల్లుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. ఆ మరణం తట్టుకోలేక అత్త హఠాన్మరణం చెందిన ఘటన కరంజి-టిలో విషాదం నింపింది. రెండు రోజుల వ్యవధిలో ఒకే ఇంట ఇద్దరు చనిపోవడంతో ఆ కుటుంబంలో తీరని శోకం నిండింది. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ గ్రామానికి చెందిన కర్నెవార్ గణేష్ మంగళవారం మృతి చెందిన సంగతి తెలిసిందే. భార్య కవిత తల్లి వచ్చలబాయి(75) భర్త చనిపోవడంతో ఏళ్లుగా కూతురు-అల్లుడి ఇంట్లో ఉంటోంది. అల్లుడి మరణంతో కూతురు, ఆమె పిల్లల భవితవ్యంఎలాగోనని రెండు రోజులుగా రోధిస్తోంది. గురువారం మధ్యాహ్నం ఉన్నట్టుండి కూర్చున్న చోటనే కుప్పకూలి చనిపోయింది.

ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా చైర్మన్‌గా శేఖర్



నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చైర్మన్‌గా నిర్మల్ పట్టణానికి చెందిన కొట్టె శేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. రాజకీయాలకు అతీతంగా అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి సంఘ బలోపేతానికి కృషిచేస్తానని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

ఆసిఫాబాద్ : 80085 73640
కాగజ్‌నగర్ : 80085 73635
వాంకిడి : 94418 88006
కౌటాల : 94401 00066

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే

? జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో చెత్త కుప్పలు పేరుకుపోయాయి. వాటిపై పందులు, ఇతర జీవాలు చేరి స్వైర విహారం చేస్తుండటంతో దుర్వాసన వస్తోంది. రాత్రివేళ దోమలతో నిద్రకు ఇబ్బందిగా మారుతోంది. పరిశుభ్రత చర్యలు చేపట్టాలి. - **సంతోష్, రాజీవ్‌నగర్**

✔ వెంటనే పారిశుద్ధ్య పనులు చేయించేలా చర్యలు తీసుకుంటాం. - **భుజంగ్‌రావు, పుర కమిషనర్**

పురుగుమందు తాగి వివాహిత బలవన్మరణం

బెజ్జూరు, న్యూస్‌టుడే : మండలంలోని నందారాంగూడ గ్రామానికి చెందిన ఓ వివాహిత పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుకుడ గ్రామానికి చెందిన సడ్మేక రాకేశ్‌తో అమృత(19)కు గతేడాది వివాహమైంది. వారిద్దరూ నందారాంగూడలో నివాసం ఉంటున్నారు. అమృతకు కొన్ని రోజుల నుంచి మతిస్థిమితం సరిగా లేదు. ఈక్రమంలో బుధవారం సాయంత్రం పురుగుమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్ ఆసుపత్రికి తీసుకెళ్లే క్రమంలోనే మృతిచెందింది. మృతురాలి సోదరుడు వెంకటేష్ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ పేర్కొన్నారు. తహసీల్దార్ భూమేశ్వర్, ఆర్ఐ సంతోష్‌లు వివరాలను అడిగి తెలుసుకున్నారు.

విద్యుత్తు పరికరాలు దగ్ధం


పరికరం కాలిపోతున్న దృశ్యం

బెజ్జూరు, న్యూస్‌టుడే : బారుగూడ గ్రామానికి చెందిన రైతులు పాలే అంజయ్య, బోరుకుట్ సత్తయ్య, పాలే సదాశివ్, బింకారి హన్మంతులకు చెందిన వ్యవసాయ విద్యుత్తు పరికరాలు బుధవారం రాత్రి దగ్ధమయ్యాయి. 33 కేవీ విద్యుత్ లైన్ తీగ తెగడంతో అధిక కరెంటు సరఫరా అయి నాలుగు విద్యుత్తు ప్యానల్ డబ్బాల్లో మంటలు వ్యాపించి కాలిపోయాయి. ఆ మార్గంలో వెళ్లిన పలువురు రైతులకు చెప్పడంతో వారు ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్తు సరఫరాను నిలిపివేశారు. ఒక్కొక్కరికీ రూ.5 వేలకు పైగా నష్టం వాటినట్లు బాధితులు వాపోయారు.

రాయితీ బియ్యం పట్టివేత

చింతలమానెపల్లి, న్యూస్‌టుడే : మండల కేంద్రం నుంచి సిర్పూర్ వైపు తరలిస్తున్న రాయితీ బియ్యాన్ని గురువారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై ఇస్లావత్ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జూరు మండలంలోని బారెగూడ, ముంజపల్లి గ్రామాలలో లబ్ధిదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసి సిర్పూర్ వైపు ఆటోలో తరలిస్తున్న మూడు క్వింటాళ్లను పట్టుకున్నామన్నారు. ఆటోతోపాటు, బియ్యాన్ని స్వాధీనం చేసుకొని పద్మ, రాము అనే ఇద్దరి వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

విద్యుత్తు స్తంభాన్ని ఢీకొన్న లారీ



సిర్పూర్(టి), న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఓ లారీ అతివేగంతో అదుపుతప్పి విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టిన ఘటన మండలంలోని వేంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లారీ అతివేగంగా రావడంతో అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టింది. స్తంభం ధ్వంసమైంది. వెంటనే సంబంధిత అధికారులకు విషయం చెప్పడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని మరమ్మతులు చేసి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు. రహదారిపై ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.


రతన్‌టాటా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వయోవృద్ధుల సంఘ నాయకులు

రతన్ టాటాకు ఘన నివాళి

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: వయోవృద్ధుల సంఘ కార్యాలయంలో గురువారం రతన్ టాటాకు ఘనంగా నివాళులర్పించారు. వయోవృద్ధుల సంఘ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. పారిశ్రామిక దిగ్గజం లక్షలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించాడని కొనియాడారు. నాయకులు నారాయణ, బి.నర్సయ్య, కోటేశ్వర్‌రావు, చిలుక లక్ష్మీనారాయణ, రామయ్య, ఎ.నాగేశ్వర్, సామాజిక కార్యకర్త దుబ్బుల జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు చిన్నారుల అప్పగింత

కౌటాల, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ఇద్దరు చిన్నారులు తప్పిపోయి ఏడుస్తూ కనిపించారు. గమనించిన ప్రయాణికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్సై మధుకర్ వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి వాట్సాప్ గ్రూపుల ద్వారా సమాచారం చేరవేశారు. స్థానిక రాజస్థానీవాసులైన తల్లిదండ్రులు వెంటనే ఠాణాకు రావడంతో.. ప్రిన్సి(6), అందని(4)లను వారికి అప్పగించారు. ఈసందర్భంగా ఎస్సై వారికి పలు సూచనలు చేశారు.


తల్లిదండ్రులకు పిల్లలను అప్పగిస్తున్న ఎస్సై మధుకర్


కాగజ్‌నగర్‌: ద్వారకానగర్‌లో..


రెబ్బెనలో..


ఎస్పీఎం క్రీడా మైదానంలో..


కాగజ్‌నగర్‌లో బతుకమ్మ ఆడుతున్న సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్ల

పోయి రావమ్మా.. గౌరమ్మ!


ఆసిఫాబాద్‌లో.. బతుకమ్మతో చిన్నారి

జిల్లావ్యాప్తంగా గురువారం సద్దుల బతుకమ్మ సందడి కనిపించింది. ఉదయం లేవగానే కుటుంబ సభ్యులు బతుకమ్మ తయారీకి అవసరమైన పూల సేకరణలో నిమగ్నమయ్యారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి అందంగా అలంకరించారు. సాయంత్రం కూడళ్లు, మైదానాల్లో పిల్లలు, పెద్దలు తేడా లేకుండా బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ.. ఆడీ పాడారు. కోలాటంతో సందడి చేశారు. - న్యూస్‌టుడే, జిల్లా బృందం


గోలేటి సింగరేణి పాఠశాల మైదానంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


గోలేటిలో టపాసులతో..


బతుకమ్మను అందంగా పేర్చి తీసుకొస్తున్న మహిళలు


చింతలమానెపల్లిలో..


బతుకమ్మ ఆడుతున్న జీఎం శ్రీనివాస్, ఎస్ఓటు జీఎం రాజమల్లు, ఏఐటీయూసీ కార్యదర్శి తిరుపతి, ప్రాజెక్టు అధికారి నరేందర్ దంపతులు


వాంకిడి ఇంద్రానగర్ కాలనీలో..


కౌటాల మండల కేంద్రంలో..

21 నుంచి బౌద్ధ దీక్ష సెమినార్

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : కాగజ్‌నగర్ పట్టణంలోని మీరతాయి అంబేడ్కర్ దీక్ష భూమి వద్ద ఈ నెల 21-30 వరకు జిల్లా స్థాయి బౌద్ధ దీక్ష సెమినార్ ఉంటుందని భారతీయ బుద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని లుంబిని దీక్ష భూమి వద్ద సంఘ సభ్యులతో కలిసి దీనికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. పది రోజుల పాటు నిర్వహించే శిబిరానికి జిల్లాలోని బౌద్ధ బాంధవులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఉత్తర తెలంగాణ అధ్యక్షుడు ప్రభాకర్, మహారాష్ట్రకు చెందిన బౌద్ధ బంతేలు హాజరవుతున్నట్లు చెప్పారు. సంఘం జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు తుకారాం చునార్కర్, ఆత్మారాం పెరుగు, కోశాధికారి తిరుపతి దుర్గం, సభ్యులు మనోహర్, సంతోష్, అజయ్, రమేశ్, జగతాప్, శ్యాంరావు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు


ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్కను కలిసిన డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్

మంత్రులను కలిసి.. సమస్యలు విన్నవించి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో గురువారం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కె.విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ గాదెవేణి మల్లేష్‌లు.. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్కలను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనులపై మాట్లాడారు. దసరా శుభాకాంక్షలు తెలిపారు. కుమురంభీం వర్ధంతికి రావాలని ఆహ్వానించారు.

తంగేడు కోసం జల్లెడ!


తంగేడు చెట్టుకు కనిపించని పూలు

సద్దుల బతుకమ్మ సందర్భంగా వివిధ రకాల పూలకు ఉన్న డిమాండ్ అంతా ఇంతా కాదు. తంగేడుకు ఉన్న విశిష్టత కారణంగా అటవీ ప్రాంతాల్లో విరివిగా పెరిగే ఈ చెట్ల పూల కోసం ప్రజలు పండగకు రెండు మూడు రోజుల నుంచే సేకరించారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఉదయం పూటనే చేన్లు, చెలకలు, అటవీ ప్రాంతాలకు వెళ్లి నిల్వ చేసుకున్నారు. పండగ పూట ఎక్కడ తిరిగినా చెట్ల ఆకులు తప్ప పూల జాడ లేదు. గోలేటి ప్రాంతంలో చెట్ల కొమ్మలను నరికి మరీ సేకరించడం గమనార్హం. మార్కెట్‌లో పిడికెడు పూలకు రూ.100కు పైగా చెల్లించి కొనుగోలు చేశారు. - **న్యూస్‌టుడే, రెబ్బెన**

ఉద్యోగుల చేతుల్లోనే సంస్థ మనుగడ

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: ఉద్యోగుల చేతుల్లోనే సింగరేణి సంస్థ మనుగడ ఉందని బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి సంస్థ సీఎండీ బలరాం ఆదేశాల మేరకు గురువారం ఖైరిగూర ఓసీపీ ఆవరణలో ఉజ్వల సింగరేణి-ఉద్యోగుల పాత్ర కార్యక్రమంలో భాగంగా మల్టీ డిపార్టుమెంట్ కమిటీ అధికారులతో కలిసి ఉద్యోగులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జీఎం మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగి బొగ్గు ఉత్పత్తి-ఉత్పాదకత సాధనకు కృషి చేయాలన్నారు. గడిచిన ఆరు నెలల్లో ఏరియా సాధించిన ఉత్పత్తిని వివరించారు. భవిష్యత్తులో సాధించాల్సిన ఉత్పత్తి లక్ష్యాలను వెల్లడించారు. రక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తూ ఉద్యోగులు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలని కోరారు. ముందుగా మొదటి షిఫ్టు, తర్వాత రెండవ షిఫ్టు ఉద్యోగులకు ప్రాజెక్టర్ ద్వారా సంస్థ సమగ్ర వివరాలను చూపించారు. ఈ సందర్భంగా జీఆర్ఎన్ ప్రతినిధులు ఒప్పంద ఉద్యోగులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున 880 మందికి అందించిన ఆధార పత్రాలను జీఎంకు అందించారు. అనంతరం విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఎస్ఓటు జీఎం రాజమల్లు, ఖైరిగూర ప్రాజెక్టు అధికారి ఎం.నరేందర్, ఏరియా ఇంజినీర్ భీమ్‌రావు జాడే, డీజీఎం ఉజ్వల్‌కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ప్రాజెక్టు ఇంజినీర్ వీరన్న, మేనేజర్ జె.శంకర్, సివిల్ ఎస్ఈ ఎస్‌కే మదీనా బాషా, కార్మికులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జీఎం ఎం. శ్రీనివాస్

బతుకమ్మ ప్రత్యేక గీతం ఆవిష్కరణ

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సింగరేణి కాలరీస్ ఆధ్వర్యంలో రూపొందించిన బతుకమ్మ ప్రత్యేక గీతాన్ని సింగరేణి సీఎండీ ఎన్.బలరాం గురువారం ఆవిష్కరించారు. బతుకమ్మ ఔన్నత్యాన్ని తెలిపేలా అద్భుతమైన గీతం రాసిన ప్రజాకవి, సింగరేణి ఉద్యోగి జయరాజ్‌ను అభినందించారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం బతుకమ్మ పండగ అని పేర్కొన్నారు. సింగరేణి వ్యాప్తంగా సంబరాలను విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సింగరేణి జీఎం (కో-ఆర్డినేటర్) సీపీఆర్వో ఎస్‌డీఎం సుభాని పాల్గొన్నారు.


సీడీ ఆవిష్కరిస్తున్న సింగరేణి సీఎండీ ఎన్.బలరాం


రెబ్బెనలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై చంద్రశేఖర్, తదితరులు

స్థలం పరిశీలించి.. సూచనలు చేసి

రెబ్బెన, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయ సమీపంలో నిర్వహించే రావణ దహన కార్యక్రమానికి సంబంధించిన స్థలాన్ని, పార్కింగ్ ప్రదేశాన్ని గురువారం ఎస్సై దొలకాసి చంద్రశేఖర్ పరిశీలించారు. ఈ నెల 12న దసరా ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. రావణ దహన కార్యక్రమం సందర్భంగా ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు చూసుకోవాలని సూచించారు. సమస్యలుంటే తమకు తెలిపాలన్నారు. ఉత్సవ కమిటీ సభ్యుడు ఎల్.రమేష్, దుర్గం దేవాజీ, మోడెం సుదర్శన్‌గౌడ్, చిరంజీవిగౌడ్, లోకా నాయుడు, గోగర్ల రాజేష్, శ్రీనివాస్‌గౌడ్, అజయ్‌జైస్వాల్, దుర్గం రాజేష్ పాల్గొన్నారు.

రావణ దహనం నిలిపేయాలని డిమాండ్

బెజ్జూరు, న్యూస్‌టుడే : దసరా రోజు నిర్వహించే రావణ దహన కార్యక్రమాన్ని నిలిపివేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో మాట్లాడారు. రావణుడిని దహనం చేస్తే ఆదివాసీలను కించపర్చినట్లేనని తెలిపారు. రాయి సెంటర్ సార్‌మేడి కొడప శంకర్, కొలవార్ మన్నెవార్ సంఘం యువజన అధ్యక్షుడు సతీష్, నాయకులు సర్దాజీ, రమేష్, అశోక్, ప్రశాంత్, మధునయ్య, షణ్ముక తదితరులు పాల్గొన్నారు.

'గనులపై భోజనాలు వ్యతిరేకిస్తున్నాం'

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: సంస్థ నిధులను దుర్వినియోగం చేస్తూ యాజమాన్యం గనులపై సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని సింగరేణి కాలరీస్ కార్మిక సంఘ్ కేంద్ర ఉపాధ్యక్షుడు అశోక్ పేర్కొన్నారు. గురువారం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రూ.33 వేల కోట్ల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక లావాదేవీలపై అవగాహన

వేమనపల్లి: మండలంలోని కల్మలపేట గ్రామంలో గురువారం దక్కన్ గ్రామీణ బ్యాంకు మేనేజరు శివశంకర్ ఆధ్వర్యంలో ఆర్థిక లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బ్యాంకు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కళాజాత బృందంతో పాటల ద్వారా వివరించారు.

శ్రమదానంతో గుంతల పూడ్చివేత

బెజ్జూరు, న్యూస్‌టుడే : మండలంలోని సలుగుపల్లి-పెంచికల్‌పేట్ గ్రామాల మధ్య రహదారికి గురువారం మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో శ్రమదానం చేపట్టారు. రోడ్డు గుంతలమయమై ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే స్పందించి రోడ్డు శ్రమదానానికి శ్రీకారం చుట్టారు. ఆయన అభిమానులు, కార్యకర్తలు దగ్గరుండి పనులు చేయించారు. గుంతల్లో మొరం వేసి చదును చేశారు. మాజీ కోఆప్షన్ సభ్యుడు బషరత్‌ఖాన్, ఆదివాసీ జేఏసీ అధ్యక్షుడు సకారాం, నాయకులు ఇస్తారి, వెంకన్న, శేఖర్, శంకర్, నారాయణ, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండలంలోని కొండపల్లి మూల మలుపు నుంచి మండల కేంద్రం వరకు రహదారిపై ఉన్న గుంతలను మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదేశాలతో.. స్థానిక నాయకులు గురువారం శ్రమదానం చేసి పూడ్చివేశారు. పనులను జడ్పీ మాజీ ఛైర్మన్ కోనేరు కృష్ణారావు పరిశీలించారు. మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.


సలుగుపల్లి-పెంచికల్‌పేట్ రోడ్డు గుంతలపై మొరం వేయించి చదును చేస్తున్న నాయకులు

రాయితీ పత్రం అందజేత

కాగజ్‌నగర్ గ్రామీణం: పట్టణానికి చెందిన ఐ.జమున అనే కిడ్నీ బాధితురాలి చికిత్స నిమిత్తం సీఎం సహాయనిధి ద్వారా రాయితీ స్థాయి పత్రం మంజూరైంది. ఈమేరకు ఆమె కుమారుడు మౌనీష్‌కు రూ.3 లక్షల రాయితీ స్థాయి పత్రాన్ని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు గురువారం అందజేశారు. బాధితురాలు హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కిడ్నీ మార్పిడి చేయాలనే వైద్యులు సూచించడంతో తల్లికి కిడ్నీ దానం చేయడానికి కుమారుడు ముందుకొచ్చాడు.

17లోగా బెల్లంపల్లి పీజీ కళాశాలలో చేరాలి

బెల్లంపల్లి పట్టణం: కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలో పీజీ కోర్సుల్లో రెండో విడతలో చేరిన విద్యార్థులు ఈ నెల 17వ తేదీలోగా బెల్లంపల్లి కళాశాలలో చేరాలని ప్రిన్సిపల్ కాంపల్లి శంకర్, పీజీ కో-ఆర్డినేటర్ మేడ తిరుపతి తెలిపారు.

కరుణించు.. కనక దుర్గమ్మ


ఇందిరానగర్‌లో ఆలయంలో పూజలు చేస్తున్న ఎస్సై చంద్రశేఖర్

రెబ్బెన, న్యూస్‌టుడే: ఇందిరానగర్‌లోని శ్రీ కనక దుర్గాదేవి ఆలయంలో గురువారం అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. ఎస్సై డి.చంద్రశేఖర్‌తో పాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకొని పూజలు చేశారు. అమ్మవారికి పట్టువస్త్రాలు, ఒడి బియ్యం సమర్పించారు. అర్చకుడు దేవర వినోద్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.


అన్నప్రసాద వితరణ..


ప్రత్యేక వేషధారణలతో బెంగాలీ మహిళలు


కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న ఎస్సై ప్రశాంత్

బాధిత కుటుంబానికి చేయూత

వాంకిడి, న్యూస్‌టుడే: మండలంలోని ఖిరిడి గ్రామానికి చెందిన రాయి సిడాం అరుణ్‌కుమార్ ఇటీవల ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంపై నుంచి పడి తీవ్రంగా గాయపడి మంచిర్యాల ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో చికిత్సలకు అయ్యే ఖర్చుల నిమిత్తం వాంకిడి ఎస్సై ప్రశాంత్ బాధిత కుటుంబానికి ఆసరాగా నిలిచారు. గురువారం బాధిత కుటుంబ సభ్యులకు రూ.15 వేలు అందించారు. ఏఎస్సై పోశెట్టి తదితరులున్నారు.

కౌటాల తహసీల్దార్‌పై ఫిర్యాదు

కౌటాల: కౌటాల తహసీల్దార్ పుష్పలతపై గురువారం పలువురు జిల్లా పాలనాధికారికి ఫిర్యాదు చేశారు. ధ్రువపత్రాల జారీ, వివిధ రెవెన్యూ పనుల విషయంలో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆరోపించారు. రాజకీయ నాయకులకు మాత్రమే స్పందిస్తున్నారని, సామాన్యులను పట్టించుకోవడం లేదన్నారు. విచారణ చేపట్టి న్యాయం చేయాలని ఫిర్యాదుదారులు రవీందర్ గౌడ్, ఉమేష్, గోపాల్, కార్తీక్ విజ్ఞప్తి చేశారు.

ఒత్తిళ్లను అధిగమిస్తేనే మానసిక ప్రశాంతత

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: నేటి సమాజంలో ఏదో ఒక సమస్య కారణంగా ఒత్తిళ్లతో మానసిక అనారోగ్యానికి గురవుతున్న నేపథ్యంలో కుంగుబాటును అధిగమిస్తే ప్రశాంత జీవనం సాధ్యమవుతుందని డా.సాయికృష్ణ పేర్కొన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని దుర్గానగర్ పంచాయతీ కేంద్రంలోని పల్లె దవాఖానాలో గురువారం మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మానసిక ఆరోగ్యం సార్వత్రిక హక్కుగా పరిగణించాలన్నారు. ఆరోగ్యం, సామాజిక, మానవ హక్కులు, ఆర్థిక పరిణామాలపై గణనీయమైన ప్రభావాలతో మానసిక రుగ్మతల భారం పెరుగుతోందని చెప్పారు. సమతుల పౌష్టికాహారం తీసుకోవడం, ధ్యానం, యోగా, వ్యాయామం చేయడం వల్ల సమస్యను అధిగమించవచ్చని చెప్పారు. బాధితులు నెం.14416కు ఫోన్ చేస్తే వైద్యులు కౌన్సెలింగ్‌తో నయం చేస్తారని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి గంగాధర్, ఆశాకార్యకర్త జమున, తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న డా.సాయికృష్ణ